నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డికాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. పాపిరెడ్డికాలనీ, స్ప్రింగ్‌వ్యాలీ, భాగ్యలక్ష్మికాలనీ, రాజీవ్ గృహకల్ప, ఆదర్శ్ నగర్, నెహ్రూనగర్, సురభికాలనీ, దూబేకాలనీ ఆరంభటౌన్‌షిప్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మియాపూర్: కేఎస్ఆర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కేఎస్ఆర్ రోడ్డు నెంబర్ 2, 4, 6 ,8, 9, 20, 12, శ్రీదేవి థియేటర్, భిక్షపతి ఎన్‌క్లేవ్, జవహర్ నగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.


ఎమ్మెల్యే వివేకానంద్‌ను సన్మానించిన కాలనీ వాసులు

ప్రజలకు అందుబాటులో ఉంటా : ఎమ్మెల్యే

పేట్‌బషీరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కృతజ్ఞత యాత్ర రెండో రోజు సోమవారం జీడిమెట్ల డివిజన్‌లో వెన్నెలగడ్డ, దుర్గా ఎస్టేట్, వసంతవిహార్, హెచ్ఎఎల్ రాఘవేంద్రకాలనీ, వెంకటేశ్వరకాలనీ ఈస్ట్, వెంకటేశ్వరకాలనీ వెస్ట్, గణేష్‌నగర్, హౌసింగ్‌సొసైటీ, ఏరోనాటికల్, కాలనీలో నిర్వహించారు. ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాలతో సన్మానించారు.

ఎస్ఆర్ ఎస్టేట్స్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం

మియాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ ఎస్టేట్స్‌లో ఏర్పాటు చేసిన 116 సీసీకెమెరాలను ఎస్‌ఐ రాజు అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో మరింత భద్రత ఉంటుందన్నారు. కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రాజు

సంగీత, నృత్య కళల్లో పిల్లలను ప్రోత్సహించాలి

- పద్మశ్రీ శోభారాజు


శ్రితను అభినందిస్తున్న శోభారాజు

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సంగీత, నృత్య కళల్లో పిల్లలను ప్రోత్సహిస్తే వారు అద్భుతాలు సాధిస్తారని పద్మశ్రీ అవార్డు గ్రహీత శోభారాజు అన్నారు. గచ్చిబౌలి బ్రహ్మకుమారి గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన శ్రిత పుట్ట కూచిపూడి నృత్య అరంగేట్రంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలు ఏ రంగాలను ఇష్టపడితే ఆయా రంగాల్లో ఎదిగేందుకు ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. గజవదన అనే నృత్య అంశంతో మొదలై విభిన్నమైన ఆరు అంశాలను ప్రదర్శించిన శ్రిత నృత్యరూపకం ఆకట్టుకుంది. శ్రిత తల్లిదండ్రులు రవి, శ్రీదేవి, కొరియోగ్రాఫర్ రఘు తదితరులు పాల్గొన్నారు.


గంగిరెద్దుల విన్యాసాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మాతృశ్రీనగర్‌లో సంక్రాంతి సంబరాలు

మియాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ మాతృశ్రీనగర్ కాలనీలో కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. కాలనీ కమ్యూనిటీహాల్ వద్ద సంక్రాంతి వంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, బోగిమంటలు, యువత గాలిపటాలు ఎగురవేసి సందడిగా గడిపారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు కావూరి అనిల్, నాగరాజు, వాసు, విజయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో కార్పొరేటర్ల పర్యటన

ఫతేనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. సోమవారం గౌతమీనగర్‌లో ఆయన పర్యటించారు. రూ. 40 లక్షలతో చేపట్టనున్న వీడీసీసీ రోడ్ల నిర్మాణ పనులపై సంబంధిత అధికారులతో చర్చించారు. కార్పొరేటర్ వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి డివిజన్‌లో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సోమవారం పాదయాత్ర చేశారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. వాటర్‌వర్క్స్ మేనేజర్ అభిషేక్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాజు యాదవ్, మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మ, వార్డు మెంబర్ ఫర్వీన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం: అయ్యప్ప సొసైటీలో కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ సోమవారం పర్యటించారు. స్థానికంగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాలనీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు గోపాల్‌నాయక్, వెంకటేష్, ప్రసాద్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతి అడుగూ ఒక మైలు రాయి

దుండిగల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మల్లంపేట్‌లో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా సంస్థ డైరెక్టర్ సునీల్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ సుధా మాధురి, రాధాసింగ్, రాజమౌళి, శ్రావణి, తనూజ, వనజ, ప్రముఖ నటీమణులు గీతా భాస్కర్, పూనమ్ కౌర్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతి అడుగూ ఒక మైలు రాయి వంటిదన్నారు. సుధామాధురి, డీజీపీ వేణుగోపాల్‌రెడ్డి, రాజమౌళి కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవంలో అతిథులు

తవ్వుతున్న రోడ్డు





రోడ్లు అధ్వానం

- ఏడాదిగా మరమ్మతులు చేయని వైనం
- మంజీరా పైపులైన్ లీకేజీతో గుంతల మయం
- ప్రజలు, వాహనదారుల అవస్థ

ఇష్టం వచ్చినట్లు తవ్వకాలు









మియాపూర్ ప్రశాంత్‌నగర్, హెచ్ఎంటీ, మదీనగూడ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రహదారులు

మియాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ల అలసత్వం కారణంగా తవ్విన రోడ్లనే తవ్వుతూ.. వేసిన రోడ్లనే వేస్తూ ప్రజాధనం వృథా చేస్తున్నారు. మియాపూర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కృషినగర్, జేపీఎన్‌నగర్‌కు వెళ్లే దారిలో అపార్ట్‌మెంట్ల డ్రైనేజీ, మంజీరా నీటి కోసం ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు రోడ్లను తవ్వేశారు. దీంతో రాకపోకలకు అసౌకర్యం కలగడంతోపాటు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. హెచ్ఎంటీ స్వర్ణపురి, మక్తాలో గుంతల మయంగా ఉన్న రహదారులను ఏడాదికాలంగా మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఎంఏనగర్ నుంచి ప్రశాంత్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారడమే కాకుండా మంజీరా పైపులైన్ లీకేజీతో నీరు నిలుస్తోంది. మైత్రికమాన్ నుంచి మంజీరా రోడ్డులో పైపులైన్ లీకేజీతో నీరు నిలిచి గుంతలమయంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి


మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను కాపాడాలని, కబ్జాలపై విచారణ జరపాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ నిజాంపేట కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వారికి సహకరించిన అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు రూ. 25 వేల కోట్ల విలువగల ప్రభుత్వ భూములను ప్లాట్లు చేసి అమ్ముకున్నారని అన్నారు. బీజేపీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, ఓబీసీ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, నిజాంపేట్ కార్యదర్శి భిక్షపతి, సెక్రటరీ అరుణ్‌రావు తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

గచ్చిబౌలి: ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గోపన్‌పల్లి, మియాపూర్, హఫీజ్‌పేట, కొండాపూర్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు కబ్జా అయ్యాయన్నారు. తాజాగా కొత్తగూడ సర్వే నెంబర్ 44లో 11 గుంటల ప్రభుత్వ భూమిని ఓ నిర్మాణ సంస్థ ఆక్రమించి రోడ్డు వేసిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ రాష్ట్ర నాయకులు పర్వతాలు, నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

హైదర్‌నగర్: ప్రభుత్వ ఆస్తులను కాపాడటంతో రెవెన్యూ అధికారులు విఫలం అవుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు నరేందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆల్విన్‌కాలనీ లాస్ట్ బస్టాప్ వద్ద శివాలయం ఎదురుగా సర్వే నెంబర్ 276 ప్రభుత్వ భూమిలో భవనం, ప్రహరీ నిర్మించారన్నారు. అధికారులు ప్రహరీ కూల్చివేసినా మళ్లీ నిర్మించారని, చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వే నెంబర్ 336 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని తహసీల్దార్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. నాయకులు కమలాకర్‌రెడ్డి, రమేష్, నరసింహారెడ్డి, ప్రకాశ్, రేవంత్ పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తదితరులు

కమ్యూనిజం, క్యాపిటలిజాలతో

సమగ్రాభివృద్ధి సాధ్యం కాదు

- ప్రఖ్యాత విధానాల రూపకర్త సాం పిట్రోడా
- 'ప్రపంచానికి కొత్త రూపం ఇద్దాం కదలిరండి' ఆవిష్కరించిన భట్టి

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడం శుభపరిణామని దేశంలో టెలికాం విప్లవానికి ఆద్యుడైన సాం పిట్రోడా అభివర్ణించారు. ఆయన రాసిన 'రీడిజైన్ ది వరల్డ్' పుస్తకానికి పోలిదాసు నరసింహారావు తెలుగు అనువాదం 'ప్రపంచానికి కొత్త రూపం ఇద్దాం కదలిరండి' పుస్తకాన్ని నగరంలో ఓ హోటల్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ఆన్‌లైన్ వేదికగా సాం పిట్రోడా మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అన్ని ప్రజాస్వామ్య దేశాలలో నియంతృత్వం చోటుచేసుకొందని వ్యాఖ్యానించారు. కమ్యూనిజం, క్యాపిటలిజం.. ఈ రెండు వ్యవస్థలూ ప్రపంచాన్ని సుఖంగా ఉంచలేవని, అవి మానవాళి సమగ్రాభివృద్ధికి తోడ్పడవని అభిప్రాయపడ్డారు. "కమ్యూనిజాన్ని వదిలి, ఇవాళ క్యాపిటలిజం నమూనాను ఎంపిక చేసుకున్నాం. అయితే, పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ అంతకంతకూ అసమానతలు పెరగడాన్ని చూస్తున్నామని" సాం పిట్రోడా అన్నారు. ప్రజాస్వామ్యం పేరుతో పాలకులు సాగిస్తోన్న నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో చదువుతున్న సమయంలో తాను సాం పిట్రోడా ప్రభావానికి లోనైనట్లు తెలిపారు. "సాం పిట్రోడా 80 ఏళ్ల వయసులోనూ ప్రపంచాన్ని మార్చడానికి, నూతన ఆవిష్కరణలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలో రోజుకు 16 గంటలు శ్రమిస్తున్నారు. ఆయన అంకితత్వం, సృజనాత్మకత, అత్యున్నత ప్రతిభ, దార్శనికత లాంటివన్నీ నాకెంతో స్ఫూర్తినిచ్చాయి" అన్నారు. కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, విశ్రాంత ఐపీఎస్ సాంబశివరావు, ఎమ్మెల్యే మదన్‌మోహన్, ఎమ్మెస్కో ఎడిటర్ డి. చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారసులు లేని భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఇ.టి. నర్సింహ

బర్కత్‌పుర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వారసులు లేని 286 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. నకిలీ పత్రాలు సృష్టించి భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భూమిని విక్రయించి వచ్చిన ఆదాయాన్ని పేదల సంక్షేమానికి ఖర్చు చేయాలని ఆయన కోరారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాలానగర్ మండలం కూకట్‌పల్లి గ్రామంలో దివంగత నవాబ్ రయీస్ యార్‌జంగ్ బహదూర్‌కు సర్వే నెంబర్ 1007లోని 286 ఎకరాల భూమి ఉందని, వారసులు లేకపోవడంతో ఆ భూమిని కొంత మంది కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఈ భూమి విలువ రూ. 22,880 కోట్లు ఉంటుందన్నారు. భూ యజమాని 1960లో చనిపోయారని, వారసులు కూడా చనిపోయారని తెలిపారు. మనవడి పేరుతో నకిలీ పత్రాలు, గిఫ్ట్ డీడ్ డాక్యుమెంట్లు సృష్టించి భూమిని కబ్జా చేశారన్నారు. భూ కబ్జాపై ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశామని ఆయన తెలిపారు. సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, సీహెచ్.శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో మహిళ ఆత్మహత్య

చందానగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపినగర్‌లో షమీమ్ బేగం(58) కుమార్తెతో కలిసి నివసిస్తోంది. కొన్నేళ్ల నుంచి ఆమె మద్యానికి బానిసయింది. ఆత్మహత్య చేసుకోవడానికి పలుమార్లు ప్రయత్నించింది.

రెండేళ్ల క్రితం యాసిడ్ తాగింది. ఆదివారం రాత్రి మద్యం మత్తులో శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. ఆమె ఇంటి నుంచి కేకలు వినపడడంతో స్థానికులు తలుపులు పగులగొట్టి చూడగా షమీమ్ బేగం తీవ్రమైన గాయాలతో పడిపోయి ఉంది. 108లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై ఎస్‌వోటీ దాడి

- 19 మంది అరెస్ట్.. రూ. 1,67,720 స్వాధీనం

జీడిమెట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై ఎస్‌వోటీ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 19 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 1,67,720, పదిహేను సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సుభాష్‌నగర్‌లో ప్లాట్ నెంబర్ 249లో కొంతకాలంగా పేకాట నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు సోమవారం దాడి చేశారు.

పేకాట ఆడుతున్న 19 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. జీడిమెట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా


ఉబేష్ (ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సెల్ఫీ దిగుతుండగా రైలు ఢీకొని ఓ బాలుడు మృతి చెందాడు. బొల్లారం రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ధానాపూర్ షాహాపూర రాంపూర్ గ్రామానికి చెందిన ఉబేష్(16) బొల్లారంలో బాబాయి ఇంటికి వచ్చాడు. సమీపంలో రైలు పట్టాల వద్ద మైదానంలో ఆడుకునేందుకు ఆదివారం వెళ్లాడు. పట్టాల వద్దకు వెళ్లిన ఉబేష్ సెల్ఫీ తీసుకుంటుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరుగుదొడ్లకు కేటాయించిన స్థలంలో

బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలి : సీపీఐ

పేట్‌బషీరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గురుమూర్తినగర్‌లో కబ్జా చేసిన స్థలాన్ని కాపాడి అందులో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్, సీపీఐ నాయకులు ఆందోళన నిర్వహించారు. రంగారెడ్డినగర్ డివిజన్ గురుమూర్తినగర్‌లో మరుగుదొడ్ల కోసం కేటాయించిన స్థలం నిరుపయోగంగా ఉండడంతో స్థానిక నాయకులు కబ్జా చేశారని, అధికారులు పట్టాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఆ స్థలంలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, సీపీఐ నాయకులు హరినాథ్, ప్రవీణ్, రాములు, నర్సయ్య, యాకోబ్, శివకుమార్ పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు

గాజులరామారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహాదేవపురంలో ఆక్రమణకు గురవుతున్న ప్రధాన రోడ్డును కాపాడి ప్రజారవాణాకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు గాజులరామారం డీసీ మల్లారెడ్డి, ఇన్‌స్పెక్టర్ రంజిత్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వందఫీట్ల రోడ్డు 50 ఫీట్లే ఉందని, రోడ్డును వ్యాపారులు ఆక్రమించారని అధికారులకు వివరించారు.

'నాలాలపై అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలి'

పేట్‌బషీరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దూలపల్లి, కొంపల్లిలో చెరువుల నాలాలపై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని దుండిగల్ మండలం ఎంఆర్‌ఓ సుచరిత, కొంపల్లి కమిషనర్ శ్రీహరికి కాంగ్రెస్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఫాక్స్‌సాగర్ నాలా, ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్‌ల్లో మట్టి నింపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బి. ప్రశాంత్‌గౌడ్, కె. గోపాల్, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌గుప్తా, నవీన్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. దూలపల్లి-చర్మాస్ రోడ్డు చౌరస్తాలో గుర్తుతెలియని వ్యక్తిని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వయస్సు 35-45 సంవత్సరాలు ఉంటాయన్నారు.

'ప్రజావాణి'కి 32 ఫిర్యాదులు

కూకట్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మూసాపేటలో జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయ పరిధి నుంచి 20 ఫిర్యాదులు అందాయి. మూసాపేట సర్కిల్ నుంచి 2, కూకట్‌పల్లి నుంచి 1, కుత్బుల్లాపూర్ 1, గాజులరామారం 6, అల్వాల్ 1, జోనల్‌కు సంబంధించినవి 9 ఫిర్యాదులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్, పారిశుధ్యం, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా అందాయి. ఫిర్యాదుదారులతో జెడ్సీ అభిలాష అభినవ్ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

చందానగర్: సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించిన ప్రజావాణికి 12 ఫిర్యాదులు వచ్చాయని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ వంశీకృష్ణ తెలిపారు. ఏఎంసీ విజయ్, ఏఎంహెచ్‌వో డాక్టర్ కార్తీక్, పీవో, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు

పేట్‌బషీరాబాద్/చందానగర్/గచ్చిబౌలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి పురపాలక సంఘంలో ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదును సీడీఎంఏ అడిషనల్ డైరెక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈనెల 17వ తేదీ వరకు డాటా ఎంట్రీ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

- ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుకు 130 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామని, ఒక్కొక్కరు రోజుకు 80 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారని శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు.

జెడ్సీగా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్

కూకట్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా నియమితులైన అభిలాష అభినవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మండడి శ్రీనివాసరావు, శిరీష, సబీహాబేగం, రవీందర్‌రెడ్డి మూసాపేటలో జోనల్ కార్యాలయంలో జెడ్సీని కలిశారు. పలువురు రాజకీయ నాయకులు, అధికారులు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

మాదాపూర్ డీసీపీగా డాక్టర్ వినీత్



రాయదుర్గం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ జోన్ డీసీపీగా డాక్టర్ వినీత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మాదాపూర్ ఏడీసీపీ నరసింహారెడ్డి, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు ఆయనకు స్వాగతం పలికారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

రాయదుర్గం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీఓ కాలనీ రంగారెడ్డిజిల్లా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గడ్డం జంగయ్య మనవరాలు శ్రేష్ట పుట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం నానక్‌రాంగూడలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. శేష్ట అమ్మమ్మ రాజ్యలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్మోహన్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.